వంతెన నిర్మాణ హామీ మరిచారా ?

- శనివారపుపేట కాజ్‌వేపై ప్రజలకు తప్పని అవస్థలు
- తమ్మిలేరు ఉధృతంగా ప్రవహిస్తే రాకపోకలు బంద్



శనివారపు పేట కాజ్‌వే



వరదలకు కాజ్‌వేపై నిలిచిన రాకపోకలు (ఫైల్)

ఏలూరు (టూటౌన్): ఏళ్ల తరబడి ఏలూరు నగర వాసులకు శనివారపుపేట కాజ్‌వేపై వంతెన నిర్మాణం కలగానే మిగిలిపోతుంది. ప్రజా ప్రతినిధులు వాగ్దానాలివ్వడం.. అనంతరం పట్టించుకోకపోవడం పరిపాటిగా మారింది. తమ్మిలేరు ఉధృతంగా ప్రవహించినప్పుడల్లా శనివారపు పేట కాజ్‌వేపై నుంచి నీరు ప్రవహించడంతో అధికార యంత్రాంగం ఈ మార్గంలో రాకపోకలు నిలిపివేయడం సర్వసాధారణమైంది. దీంతో ఏలూరుకు ఇటు వైపు నుంచి అటు వైపుకు, వివిధ గ్రామాలకు వెళ్లేందుకు ప్రజలు ఇబ్బందులు తప్పడంలేదు. కాజ్‌వే స్థానంలో రూ.15 కోట్ల వ్యయంతో పై వంతెన నిర్మాణం చేపట్టనున్నట్టు ఎమ్మెల్యే బడేటి రాధాకృష్ణయ్య (చంటి) గతంలోనే ప్రకటించారు. ఇది జరిగి ఐదు నెలలు కావస్తున్నా ఇంత వరకు పనులు చేపట్టలేదు. ఇప్పటికైనా ఎమ్మెల్యే హామీ మేరకు శనివారపు పేట కాజ్‌వేపై వంతెనను తక్షణం నిర్మించాలని ప్రజలు ముక్త కంఠంతో కోరుతున్నారు.

నిత్యం 50 వేల మంది రాకపోకలు

శనివారపుపేట కాజ్‌వేపై నుంచి తమ్మిలేరు అవతల ఉన్న శ్రీరామ్ నగర్, గ్లేవియర్ నగర్, శనివారపు పేట, లునాని నగర్, దొండపాడు, శనివారపుపేట వంటి ప్రాంతాలతో పాటు దుగ్గిరాల, పినకడిమి, చినకడిమి, కొప్పాక మీదుగా నూజివీడు ప్రాంతాలకు వెళ్లేందుకు రాకపోకలు సాగిస్తుంటారు. దుగ్గిరాల డెంట్ కాలేజ్, సెయింట్ ఆన్స్ కాలేజ్ వంటి ప్రముఖ విద్యా సంస్థలకు వెళ్లాలంటే ఇదే మార్గం. రోజుకు కనీసం 50 వేల మంది వరకు ఈ కాజ్ వేపై నుంచి రాకపోకలు చేస్తుంటారు. నూజివీడు వైపు వెళ్లే ఆర్టీసీ బస్సులు కూడా ఇదే మార్గంలో ప్రయాణిస్తుంటాయి. జాతీయ రహదారి నుంచి దుగ్గిరాల మీదుగా ఏలూరు నగరంలోకి వాహనదారులు ఇదే మార్గంలో వెళ్లి వస్తుంటారు. ఇంతటి విశిష్టత గల ఈ మార్గం తమ్మిలేరుకు వరద వచ్చినప్పుడల్లా రాకపోకలు నిలిచిపోతుండటంతో ఇటు నగర వాసులుతో పాటు అటు సమీప గ్రామాల ప్రజలు అనేక అవస్థలు ఎదుర్కొంటున్నారు. ఈ నేపథ్యంలో కాజ్‌వే స్థానంలో పూర్తిస్థాయిలో వంతెన నిర్మించాలని ఈ ప్రాంత ప్రజలు కోరుతున్నారు.

పనులు తక్షణం ప్రారంభించాలి



వంతెన నిర్మాణ పనులు తక్షణం ప్రారంభించాలి. శనివారపుపేట కాజ్‌వే స్థానంలో పూర్తిస్థాయిలో వంతెనను నిర్మించాలి. ఏటా వర్షాకాలంలో తమ్మిలేరు ఉధృతిగా ప్రవహించినప్పుడు, వరద వచ్చినప్పుడు ఏలూరు నగరంలో మొదటి సారిగా ప్రభావం చూపేది ఈ కాజ్‌వే పైనే. ప్రభుత్వం కాజ్‌వే స్థానంలో పూర్తి స్థాయి వంతెనను నిర్మించాలని ప్రజలు ముక్తకంఠంతో కోరుతున్నారు.

– గొట్టాపు రవికిషోర్, మాజీ ఎంపీటీసీ, శనివారపు పేట, ఏలూరు

ప్రజల ఆకాంక్షలను నెరవేర్చాలి



శనివారపుపేట కాజ్‌వే స్థానంలో వంతెన నిర్మించి ప్రజలు ఆకాంక్షలను పాలకులు నెరవేర్చాలి. ఏటా తమ్మిలేరు పొంగినప్పుడల్లా ఏలూరు నగరంలోకి వెళ్లేందుకు స్థానికంగా ఉండే తాము ఎంతో ఇబ్బంది పడుతున్నాం. దుగ్గిరాల డెంటల్ కాలేజీకి వెళ్లే విద్యార్థులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. వివిధ పనుల నిమిత్తం ఏలూరు నగరంలోకి వచ్చి తిరిగి ఇంటికి వెళ్లేందుకు అవస్థలు తప్పడం లేదు. ప్రజా ప్రతినిధులు ప్రకటించిన విధంగా తక్షణం వంతెనను నిర్మించాలి.

– కె.రామాంజనేయులు, సీపీఎం నగర కమిటీ సభ్యుడు, ఏలూరు

క్లుప్తంగా

కలెక్టర్‌ను కలిసిన అటవీ శాఖ అధికారి



కలెక్టర్ వెట్రిసెల్వికి మొక్కను అందిస్తున్న శ్రీశుభమ్

ఏలూరు(మెట్రో): ఏలూరు జిల్లాకు జిల్లా అటవీశాఖ అధికారిగా శ్రీశుభమ్ బాధ్యతలు చేపట్టిన సందర్భంగా సోమవారం జిల్లా కలెక్టర్ కె.వెట్రిసెల్విని మర్యాదపూర్వకంగా కలిసి పూలమొక్కను అందజేశారు. కలెక్టర్ వెట్రిసెల్వి శ్రీశుభమ్‌కు అభినందనలు తెలిపారు. అన్నమయ్య జిల్లా రైల్వే కోడూరు సబ్ డివిజన్ నుంచి బదిలీపై ఏలూరు జిల్లా అటవీశాఖ అధికారిగా బాధ్యతలు చేపట్టారు.

రైతుల అనుభవాలను విద్యార్థులతో పంచుకోవాలి



భోగాపురంలో విద్యార్థులు ఏర్పాటు చేసిన ఎగ్జిబిషన్‌ను పరిశీలిస్తున్న అధికారులు

పెదవేగి : రైతులు తమ అనుభవాలను విద్యార్థులతో పంచుకోవాలని ఏలూరు జిల్లా ఏరువాక కేంద్రం కోఆర్డినేటర్ డాక్టర్ కె. ఫణికుమార్ అన్నారు. పెదవేగి మండలం భోగాపురం స్థానిక రైతు సేవా కేంద్రం వద్ద సోమవారం రైతు సదస్సును నిర్వహించారు. ఆచార్య ఎన్‌జీ రంగా విశ్వవిద్యాలయం అనుబంధ సంస్థ మార్కాపురం ఎన్.ఎస్. వ్యవసాయ కళాశాలకు చెందిన విద్యార్థులు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో రైతులు వ్యవసాయంలో తమ అనుభవాలను విద్యార్థులతో పంచుకున్నారు. ఆధునిక వ్యవసాయ పద్ధతులను ఉపయోగించి వ్యవసాయాన్ని లాభసాటి చేసుకోవాలని రైతులకు ఏరువాక కేంద్రం సమన్వయకర్త ఫణికుమార్ తెలిపారు. రైతు సదస్సులో భాగంగా విద్యార్థులు ఎగ్జిబిషన్‌ను ఏర్పాటు చేశారు. విస్తరణ శాస్త్రవేత్త ఎన్. నాగేంద్రబాబు, ఎన్ఎస్ వ్యవసాయ కళాశాల అసోసియేట్ డీన్ డాక్టర్ ఆర్‌వీఎస్‌కే రెడ్డి, ఎన్ఎస్ వ్యవసాయ కళాశాల ఏడీఆర్ రవి తేజ, పెదవేగి ఏఓ ప్రియాంక, పెదపాడు ఏఓ ప్రవీణ్, సర్పంచ్ రమేష్, రైతులు పాల్గొన్నారు.

బాలకృష్ణమ్మకు నివాళి

ఏలూరు (ఆర్‌ఆర్‌పేట): స్థానిక శ్రీ కృష్ణ దేవరాయ కార్పొరేషన్ ఉన్నత పాఠశాలలో ఆంధ్రప్రదేశ్ టీచర్స్ ఫెడరేషన్ 1938 ఏలూరు జిల్లా శాఖ ఆధ్వర్యంలో సోమవారం మార్పు బాలకృష్ణమ్మ 12వ వర్ధంతి సభ నిర్వహించారు. ముఖ్యఅతిథిగా రాష్ట్ర అకాడమిక్ కమిటీ కన్వీనర్ గుగ్గులోతు కృష్ణ హాజరై మాట్లాడారు. బాలకృష్ణమ్మ చిత్రపటానికి పూల మాలాలు వేసి ఘనంగా నివాళులర్పించారు. నాయకులు పి.రత్నం బాబు, జి.మోహన్‌రావు, జి.రాజు, ఈ.రామ్మోహన్, డి.శ్రీనివాసరావు, జి.వెంకటరమణ, ఎస్వీ దుర్గారావు, పి.నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

గురుకుల విద్యార్థినుల ప్రతిభ



వట్లూరు గురుకుల పాఠశాల విద్యార్థికి నగదు బహుమతిని అందిస్తున్న అధికారులు

పెదపాడు: పశ్చిమగోదావరి జిల్లా తణుకులో నిర్వహించిన రాష్ట్రస్థాయి వైజ్ఞానిక ప్రదర్శనలో వట్లూరు గురుకుల పాఠశాల విద్యార్థి కె శృతి రూపొందించిన ప్రాజెక్టు జూనియర్స్ విభాగంలో రాష్ట్రస్థాయిలో మొదటిస్థానంలో నిలిచింది. దీంతో నిర్వాహకులు రూ.10వేల నగదు బహుమతిని అందించారు. ప్రిన్సిపాల్ దాసరి మేరీ ఝాన్సీ రాణి ప్రాజెక్టు రూపకల్పనకు కృషిచేసిన ఉపాధ్యాయురాలు కె అనిత, విద్యార్థులను అభినందించారు.

జయప్రకాష్ పరామర్శలు



సూరిబాబు తల్లి మృతదేహం వద్ద నివాళులర్పిస్తున్న జయప్రకాష్



రాజు సోదరుడి మృతదేహం వద్ద నివాళులర్పిస్తున్న జయప్రయాష్

ఏలూరు టౌన్: స్థానిక చేపలతూము సెంటర్ ప్రాంతానికి చెందిన వైఎస్సార్ సీపీ నాయకులు సింగవరపు సూరిబాబు తల్లి మృతిచెందారు. ఆమె మృతదేహంపై వైఎస్సార్‌సీపీ ఏలూరు సమన్వయకర్త మామిళ్లపల్లి జయప్రకాష్ పూలమాలలు వేసి నివాళులర్పించారు. సూరిబాబు కుటుంబ సభ్యులను పరామర్శించి, తమ ప్రగాఢ సానుభూతి తెలిపారు. పార్టీ అండగా ఉంటుందని భరోసా కల్పించారు. జేపీ ఎంట ఏలూరు మాజీ డిప్యూటీ మేయర్ గుడిదేశి శ్రీనివాసరావు, బీసీ సెల్ రాష్ట్ర నాయకులు కిలాడి దుర్గారావు, ఎస్సీ సెల్ నాయకులు, జిల్లా అధికార ప్రతినిధి మున్నుల జాన్‌గురునాథ్ తదితరులు ఉన్నారు.

- ఏలూరు రూరల్ మండలం పాలగూడెంకు చెందిన పార్టీ నాయకులు కేవీకే రాజు సోదరుడు కరణం రాజేశ్వరరావు ఆకస్మికంగా మృతిచెందాడు. ఆయన మృతదేహం వద్ద పార్టీ సమన్వయకర్త జయప్రకాష్ పూలమాలలు ఉంచి ఘనంగా నివాళులర్పించారు. రాజేశ్వరరావు కుటుంబానికి ధైర్యాన్ని చెప్పి వారికి ప్రగాఢ సానుభూతి, సంతాపాన్ని తెలిపారు. వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలకు పార్టీ ఎల్లవేళలా అండగా నిలుస్తుందని తెలిపారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు, కార్యకర్తలు ఉన్నారు.

ఆర్టీసీ కార్గో డోర్ డెలివరీపై అవగాహన



అవగాహన ర్యాలీలో పాల్గొన్న ఆర్టీసీ ఏలూరు డీఎం, సిబ్బంది

ఏలూరు (ఆర్‌ఆర్‌పేట): ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ అందించే కార్గో, కార్గో డోర్ డెలివరీ సేవలను సద్వినియోగం చేసుకోవాలని ఆర్టీసీ ఏలూరు డిపో మేనేజర్ బి.వాణి ప్రజలను కోరారు. ఆర్టీసీ కార్గో మాసోత్సవ ర్యాలీ సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా వాణి మాట్లాడుతూ ఈ నెల 19 వరకు నిర్వహించే మాసోత్సవాల్లో ప్రయాణికులు వారి బంధువులకు, మిత్రులకు, శ్రేయోభిలాషులకు వారికి నచ్చిన పిండి వంటలు, బహుమతులు, ఇతర ఏ వస్తువులనైనా సరే తక్కువ ధరలతో వారికి నచ్చిన పట్టణాలకి 24 గంటల్లోనే 50 కేజీల వరకు, 10 కిలోమీటర్ల పరిధి వరకు ఈ డోర్ డెలివరీ అందించే ఏర్పాటు చేశామని చెప్పారు. ర్యాలీ ఏలూరు డిపో గ్యారేజీ నుంచి కొత్త బస్టాండు, ఫైర్ స్టేషన్ సెంటర్ మీదుగా నిర్వహించారు. కార్యక్రమంలో ఆర్టీసీ ఏఎంటీ జి.మురళి, మెకానికల్ ఫోర్‌మెన్ ఐ.ప్రేమ్ కుమార్, గ్యారేజీ సిబ్బంది, కార్మికులు, పీఆర్‌ఓ కేఎల్వీ నరసింహం పాల్గొన్నారు.

అలరించిన 'శ్రీ కృష్ణ రాయబారం'



శ్రీకృష్ణ రాయబారం నాటకం ప్రదర్శిస్తున్న కళాకారులు

ఏలూరు (ఆర్‌ఆర్‌పేట): స్థానిక రామచంద్రరావుపేట వేంకటేశ్వర స్వామి దేవస్థానంలో శ్రీవారి త్రిసప్తాహ బ్రహ్మోత్సవాల్లో భాగంగా సోమవారం నిర్వహించిన ఆధ్యాత్మిక, కూచిపూడి నృత్య కార్యక్రమాలు భక్తులను విశేషంగా అలరించాయి. ఉదయం స్వామి వారికి సుప్రభాత సేవ, నిత్యార్చన నిర్వహించారు. అనంతరం విష్ణు సహస్ర నామ పారాయణ, స్వామివారికి విశేష అలంకరణ చేశారు. ఉదయం 10 గంటల నుంచి స్వామి వారి నిత్య కల్యాణ మహోత్సవం అంగరంగ వైభవంగా నిర్వహించారు. నీరాజన మంత్రపుష్పాలు సమర్పించి తీర్థప్రసాద వితరణ చేశారు. సాయంత్రం తిరిగి సాయంకాల పూజలు నిర్వహించారు. సాయంత్రం 5.30 గంటలకు మాగిపూడి వాణిశ్రీ భక్తి సంగీత విభావరి నిర్వహించారు. సాయంత్రం 6.30 గంటల నుంచి తెనాలికి చెందిన నోరి నారాయణ మూర్తి శ్రీ వేంకటేశ్వర వైభవం అనే అంశంపై ఆధ్యాత్మిక ప్రవచనం చేశారు. రాత్రి 8 గంటల నుంచి శ్రీకృష్ణ రాయబారం పౌరాణిక నాటకం భక్తులను విశేషంగా అలరించింది. అర్చకులు కిళాంబి మారుతీ శ్రీనివాస రామానుజాచార్యులు విశేష పూజలు నిర్వహించగా ఆలయ కార్యనిర్వహణాధికారి నల్లూరి సతీష కుమార్ కార్యక్రమాలను పర్యవేక్షించారు.

బెల్లపు ఊట ధ్వంసం

పోలవరం రూరల్: పోలవరం ఎక్సైజ్ అధికారులు సర్కిల్ పరిధిలో దాడులు నిర్వహించారు. ఎక్సైజ్ సీఐ కె.వీరబ్రహ్మం మాట్లాడుతూ ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు మండలంలో దాడులు నిర్వహించామన్నారు. ఈ నేపథ్యంలో మండలంలోని ఎల్ఎన్‌డీపేట గ్రామ శివారు అటవీ ప్రాంతంలో బెల్లపు ఊట డంప్‌ను గుర్తించామన్నారు. డ్రమ్ముల్లో నిల్వ ఉంచిన 2,600 లీటర్ల బెల్లపు ఊటను గుర్తించి ధ్వంసం చేసినట్లు తెలిపారు. ఈ దాడుల్లో ఈఎస్‌టీఎఫ్ ఇన్‌స్పెక్టర్ ఆర్.సత్యవతి, ఏలూరు ఎన్‌ఫోర్స్‌మెంట్ సిబ్బంది, పోలవరం ఎక్సైజ్ సిబ్బంది పాల్గొన్నారు.

నేటి నుంచి పీసా ఎన్నికలు



దొరమామిడిలో పీసా ఎన్నికలపై అవగాహన కల్పిస్తున్న కార్యదర్శులు

బుట్టాయగూడెం: ఏజెన్సీ గిరిజన మండలాల్లోని గ్రామాల్లో పీసా ఎన్నికలు మంగళవారం నుంచి 9వ తేదీ వరకూ నిర్వహించనున్నారు. ఎంతో ప్రతిష్టాత్మకంగా నిర్వహించనున్న ఎన్నికలకు సంబంధించి అధికారులు అన్ని ఏర్పాట్లు చేశారు. గ్రామస్థాయిలో ఏ పని జరగాలన్నా పీసా తీర్మానం తీసుకోవాలి. దీనికి పీసా ఆమోదం అవసరం కావడంతో ఈ ఎన్నికల్లో పోటీ చేసేందుకు పలువురు ఆసక్తి చూపుతున్నారు. ఈ ఎన్నికలకు సంబంధించి బుట్టాయగూడెం, జీలుగుమిల్లి మండలాల్లో ముంపు మండలాల నుంచి తరలివచ్చిన గిరిజనులకు కూడా ఎన్నికల్లో పాల్గొనే అవకాశం ప్రభుత్వం కల్పించింది. దీనితో స్థానిక గిరిజనులు, నిర్వాసిత గిరిజనుల మధ్య పోటీ గట్టిగా జరిగే అవకాశం కనిపిస్తోంది. ఈ ఎన్నికలకు సంబంధించి సోమవారం కార్యదర్శులు గ్రామాల్లో ముమ్మర ప్రచారం చేశారు. మంగళవారం బుట్టాయగూడెం మండలంలో నిర్వహించనున్న ఎన్నికల షెడ్యూల్‌ను ఎంపీడీఓ కె. జ్యోతి వివరించారు. ఎన్నికల మొదటిరోజు 20 గ్రామాల్లో సభలు నిర్వహించి వీటిలో ఉపాధ్యక్షులు, కార్యదర్శులను ఎన్నుకుంటారని ఆమె తెలిపారు. మండలంలోని అలివేరు, లంకపాకల, రేగులపాడు, అంతర్వేదిగూడెం, నాగులగూడెం, గాడిదబోరు, పందిరిమామిడిగూడెం, అచ్చియ్యపాలెం, ఇప్పలపాడు, రేగులకుంట, సీతప్పగూడెం, బుట్టాయగూడెం, దొరమామిడి, చిన్నజీడిపూడి, గుబ్బిసమామిడి, కొమరవరం, వీరమద్దిగూడెం, గురుగుమిల్లి, తెల్లంవారిగూడెం, బొడ్డేరు గ్రామాల్లో ఎన్నికలు నిర్వహిస్తున్నట్లు ఎంపీడీఓ తెలిపారు.

శ్రీవారి ఆలయంలో వైభవంగా ధనుర్మాసోత్సవం

ద్వారకాతిరుమల: క్షేత్రంలో నిర్వహిస్తున్న ధనుర్మాసోత్సవాలు శ్రీవారి వైభవాన్ని చాటుతున్నాయి. నిత్యం ఆలయంలో సుప్రభాత సేవకు బదులు, తిరుప్పావై పాశురాలను పఠిస్తున్నారు. స్వామివారి గ్రామోత్సవాన్ని కన్నుల పండువగా నిర్వహిస్తున్నారు. అందులో భాగంగా సోమవారం ఉదయం నిర్వహించిన శ్రీవారి తిరువీధి సేవ భక్తులకు నేత్రపర్వమైంది. ఉదయం ఆలయంలో స్వామి, అమ్మవార్లు, గోదాదేవి ఉత్సవ మూర్తులను తొళక్క వాహనంపై ఉంచి, విశేష పుష్పాలంకారాలు చేశారు. పూజల అనంతరం స్వామివారి వాహనం ఆలయ ప్రధాన రాజగోపురం మీదుగా క్షేత్ర పురవీధులకు పయనమైంది. మేళతాళాలు, మంగళ వాయిద్యాలు, అశ్వ, గజ సేవలు, అర్చకులు, పండితుల వేద మంత్రోచ్ఛరణల నడుమ శ్రీవారు క్షేత్ర పురవీధుల్లో అట్టహాసంగా ఊరేగారు. ధనుర్మాస మండపంలో స్వామి, అమ్మవార్లు, గోదాదేవికి అర్చకులు విశేష పూజలు చేసి, హారతులిచ్చారు.

భూ పంపిణీతోనే అభివృద్ధి సాధ్యం



సదస్సులో మాట్లాడుతున్న వెంకటేశ్వర్లు

ఏలూరు (టూటౌన్): పేదల సమస్యల పరిష్కారం సమగ్ర భూ పంపిణీతోనే సాధ్యమవుతుందని ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వి.వెంకటేశ్వర్లు అన్నారు. సోమవారం స్థానిక ఉద్ధరాజు రామం భవనంలో అన్నే వెంకటేశ్వరరావు 21వ వర్ధంతి సందర్భంగా సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఎ.రవి అధ్యక్షత స్మారక భూ సదస్సు నిర్వహించారు. సదస్సుల్లో వెంకటేశ్వర్లు మాట్లాడుతూ రాష్ట్రంలో 29 లక్షల ఎకరాలకు పైగా అసైన్డ్ భూములు ఉన్నాయని తెలిపారు. భూమి భిక్షంగా కోరితే దక్కదని పోరాడితేనే సాధించుకోగలమని పుచ్చలపల్లి సుందరయ్య, డాక్టర్ బీఆర్ అంబేడ్కర్‌లు చెప్పారని గుర్తుచేశారు. వారి బాటలోనే స్వాతంత్ర సమరయోధుడు వ్యవసాయ కార్మిక, రైతు సంఘాల నాయకులు అన్నే వెంకటేశ్వరరావు ఆయన భార్య అనసూయమ్మలు ప్రజల హక్కులు, భూ సాధన కోసం పోరాడారని కొనియాడారు. ప్రస్తుత రెవెన్యూ సదస్సులు ఒక డ్రామాగా అభివర్ణించారు. జగన్ హయాంలో ప్రభుత్వం భూములు కొల్లగొట్టారని విమర్శిస్తున్న కూటమి ప్రభుత్వం రిలయన్స్‌కు కోరినచోట ఐదు లక్షల ఎకరాల వరకు కట్టబెట్టడానికి ముందుకొచ్చిందని విమర్శించారు. సదస్సులో రవి, వివిధ సంఘాల నాయకులు ఆర్ లింగరాజు, గుడిపాటి నరసింహారావు, ఎ.ఫ్రాన్సిస్, కట్టా భాస్కర్, సత్యనారాయణ మాట్లాడారు.

పంచాయతీ చెరువు మట్టి తరలింపుపై ఫిర్యాదు



పోలసానిపల్లిలో చెరువు మట్టితో పూడ్చి చదును చేస్తున్న దృశ్యం

భీమడోలు: పోలసానిపల్లి పంచాయతీ చెరువును తవ్వి ఆ మట్టిని నిబంధనలకు విరుద్ధంగా జగనన్న కాలనీలోని రైతు భరోసా కేంద్రానికి ఎదురుగా ఉన్న పొలంలో వేసి పూడ్చుతున్నారని, ఆ పనులను వెంటనే నిలుపుదల చేయాలని కోరుతూ పోలసానిపల్లి మాజీ ఉపసర్పంచ్, వైఎస్సార్‌సీపీ నేత అంబటి నాగేంద్రప్రసాద్ మీకోసంలో ఫిర్యాదు చేశారు. భీమడోలు తహసీల్దార్ కార్యాలయంలో ప్రజాసమస్యల పరిష్కార వేదికలో తహసీల్దార్‌కు ఫిర్యాదు చేశారు. ఈ పొలం ల్యాండ్ సీలింగ్‌లో నిరుపేదలైన 8 మందికి వ్యవసాయం చేసుకునేందుకు కేటాయించారని, అయితే లబ్దిదారులకు సంబంధం లేని వ్యక్తులు పొలాన్ని పూడ్చి రియల్ ఎస్టేట్ వ్యాపారం చేసుకునేందుకు ప్రయత్నిస్తున్నారని ఆరోపించారు. రెండు రోజులుగా ట్రాక్టర్లతో మట్టి వేసి పొలాన్ని పూడ్చుతున్నారని తెలిపారు. అక్రమ మైనింగ్ చేస్తున్న వ్యక్తులపై కఠిన చర్యలు తీసుకోవాలని, పంచాయతీ పరిధిలోని మట్టిని తరలించుకునేందుకు అనుమతులు ఇచ్చిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని ఆయన కోరారు. గ్రామ కార్యదర్శి జయరామకృష్ణను వివరణ కోరగా గ్రామంలోని ఎక్కడా అక్రమంగా మట్టి తరలించడం లేదని, నిబంధనలకు మేరకు పనులు చేస్తున్నామన్నారు. గ్రామంలోని చెరువుల అక్రమణలు తొలగించి వాటిని పునరుద్ధరించే కార్యక్రమాన్ని చేపట్టామన్నారు. బుచ్చిరాజుగుంట చెరువులోని ఆక్రమణలు తొలగిస్తున్నామన్నారు.

చెరువు గట్టును పటిష్టం చేయాలి

పోలసానిపల్లిలోని అక్రమణలకు గురైన చెరువులను గుర్తించి వాటి గట్టు చుట్టూ మట్టిపోసి పటిష్టపర్చేందుకు చర్యలు తీసుకోవాలని ఎంపీటీసీ అంబటి దేవి కోరారు. చెరువుల్లోని మట్టిని తరలించి అక్రమ ల్యాండ్ సీలింగ్ భూములను పూడ్చేందుకు వినియోగించరాదని పంచాయతీ అధికారులను కోరినా పట్టించుకోలేదని తెలిపారు. బుచ్చిరాజుకుంటలో ఆక్రమణలు సోమవారం తొలగిస్తున్నట్లు అధికారులు చెప్పారని, శని, ఆదివారం రాత్రి సమయాల్లో అదే చెరువు నుంచి మట్టి తరలించారని ఆమె ఆరోపించారు. ఈ సమస్యను ఎమ్మెల్యే పత్సమట్ల ధర్మరాజు దృష్టికి తీసుకెళ్తామని, ఆ పొలం స్థలాన్ని ఇంటి స్థలం లేని నిరుపేదలకు ఇవ్వాలని, అధికారులు స్వాధీనం చేసుకోవాలని ఆమె కోరారు.

ఆర్టీసీ సమాచారం

ఏలూరు ఆర్టీసీ డిపో నుంచి దూరప్రాంతాలకు వెళ్లే బస్సుల సమయాలు, రిజర్వేషన్ వివరాలు

ఏసీ బస్సులు..

బస్సు రూటు	సమయం	అందుబాటులో ఉన్న సీట్లు
ఏలూరు -బీహెచ్ఈఎల్ (ఇంద్ర)	21.00	33
ఏలూరు -బీహెచ్ఈఎల్ (అమరావతి)	22.00	42
ఏలూరు - బీహెచ్ఈఎల్ (స్టార్ లైనర్ నాన్ఏసీ స్లీపర్)	22.30	21
ఏలూరు - తిరుపతి(ఇంద్ర)	19.00	33

సూపర్ లగ్జరీ

బస్సు రూటు	సమయం	సర్వీస్ నంబర్	అందుబాటులో ఉన్న సీట్లు
ఏలూరు - బీహెచ్ఈఎల్	21.45	4820	28
ఏలూరు - బీహెచ్ఈఎల్	21.15	4822	31
ఏలూరు - బీహెచ్ఈఎల్ వయా కే.కోట	19.30	4796	31
ఏలూరు -బీహెచ్ఈఎల్ వయా రామచంద్రపురం	19.45	4798	33
ఏలూరు-జీడిమెట్ల వయా ఖమ్మం	20.15	4802	29
ఏలూరు-బీహెచ్ఈఎల్ వయా ఖమ్మం	20.30	4800	28
ఏలూరు - బీహెచ్ఈఎల్ వయా ఖమ్మం	21.00	4804	34
ఏలూరు - ఈసీఐఎల్	22.30	4814	30
ఏలూరు - తిరుపతి	16.00	4830	34

కూరగాయల ధరలు

ఏలూరు నగరంలోని రైతు బజార్లలో కూరగాయల ధరలు

కూరగాయలు	కిలో ధర	కూరగాయలు	కిలో ధర
టమాటాలు	16	అరటి కాయ (1)	06-08
వంకాయలు (గులాబీ)	34	చిక్కుడు కాయలు	56
వంకాయలు (కాంతులు)	48	బీన్షచిక్కుడు	80
వంకాయలు (తెలుపు)	40	చామదుంపలు	40
బెండకాయలు	40	ములక్కాడలు	10, 15
పచ్చిమిర్చి	32-36	కంద	60
కాకర కాయలు	36-44	బీట్‌రూట్	46
బీరకాయలు	30	కీరా దోస	44
బీరకాయలు (పందిరి)	48	ఫ్రెంచ్‌బీన్స్	80
క్యాబేజీ	28	అల్లం	70
క్యారెట్	48	కొత్తిమీర (కట్ట)	15
దొండకాయలు	46	పాలకూర	10
బంగాళదుంపలు	32-36	చుక్కకూర	10
ఉల్లిపాయలు	42	తోటకూర	10
గోరుచిక్కుడు	40	గోంగూర	07
దోసకాయలు	30-36	పుదీనా	05
అనబకాయ (1)	25-30	క్యాప్సికమ్	70
పొట్లకాయ(1)	20-25	చిలకడదుంప	36